క్లుప్తంగా

ఫ్రీజర్ బాక్సుల వితరణ



గన్నవరం: స్థానిక గ్రామ పంచాయతీకి శనివారం దాతలు రెండు ఫ్రీజర్ బాక్సులను అందజేశారు. తోటకూర అపరాయవర్మ–శాంతాదేవి, నెక్కలపూడి సుబ్రహ్మణ్యం–కృష్ణకుమారి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు వీటిని గ్రామ సర్పంచి నిడమర్తి సౌజన్య సమక్షంలో గ్రామ పంచాయతీకి అప్పగించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం ఫ్రీజర్ బాక్సులను అందజేసినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, గ్రామ ప్రముఖులు నెక్కలపూడి ఈశ్వరరావు, టీఎస్ఆర్కే ప్రసాద్, శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కల్పించాలి

పటమట(విజయవాడతూర్పు): పారిశుద్ధ్య కార్మికులకు జీవిత భద్రత కల్పించాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుదే రాజా అన్నారు. యోగా డే కార్యక్రమం సందర్భంగా శనివారం ఉదయం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పారిశుద్ధ్య విధులు నిర్వహించుచున్న 47వ డివిజన్ కార్మికురాలు ముత్యాల సింహాచలంపై ఎల్ఈడీ స్క్రీన్ పడి గాయాల పాలై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను యూనియన్ సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం ఏళ్లు గడుస్తున్నా అందటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చనిపోయిన వారికి రూ.20 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షలు ఘటన జరిగిన నెల రోజుల్లోపే అందించాలన్నారు.

ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం మహిళా కమిటీ ఎన్నిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం సెంట్రల్ నియోజకవర్గ మహిళా కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలుగా ఇస్సంశెట్టి ఉషాజ్యోతి, ప్రధాన కార్యదర్శిగా తిరుమలశెట్టి లక్ష్మీసత్యభార్గవి, ఉపాధ్యక్షురాలుగా మారుబోయిన వినయవాణి, గరికపాటి అన్నపూర్ణ, కార్యదర్శిగా కనుగుల చిన్నమ్మడు, ఇందుర్తి శ్రీలత, ఇప్పిలి రత్నకుమారి, రావులపల్లి అనసూయ, ఇందుర్తి శ్లోక, మజ్జి సుభద్ర, తోట సంధ్యారాణి, కనుగుల ప్రసన్న ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేశారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

- నిబంధనలు బేఖాతరు
- రూ.లక్షలు వెనకేస్తున్న అక్రమార్కులు
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికార టీడీపీ అండదండలతో పలు గ్రామాల్లోని చెరువుల్లో పొక్లెయిన్లతో మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. ఇళ్ల స్థలాలు, పొలాలు మెరక చేసుకునే సాకుతో తాత్కాలిక అనుమతులు పొందుతున్న అక్రమార్కులు దర్జాగా మట్టి అమ్ముకుంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు సాగిస్తూ, టిప్పర్లు, ట్రాక్టర్లతో ప్రైవేట్ స్థలాలకు తరలిస్తున్నారు. అసలు ఎలాంటి అనుమతులు లేకుండానే మరికొందరు అధికార పార్టీ నేతలు మట్టి తవ్వకాలతో లక్షల్లో సొమ్ము వెనకేసుకుంటున్నారు.

నిబంధనల ఉల్లంఘనలు..

ఇళ్ల స్థలాలు, పొలాలు మెరక చేసుకునే సాకుతో చెరువుల్లో మట్టి తవ్వకాలకు ఇరిగేషన్ శాఖ నుంచి తాత్కాలిక అనుమతులు పొందుతున్న అధికార పార్టీ నాయకులు అడ్డూఅదుపు లేకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. నిర్ణీత లోతు లేదా నిర్ణీత క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే తవ్వకం చేయాలని అనుమతుల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ



చిన్నమల్లమ్మ కుంట చెరువులో ట్రాక్టర్లలో తరలిస్తున్న మట్టి



వీరవల్లిలో మట్టి తవ్వకాలు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారు. మరికొన్ని చోట్ల వారం రోజుల పాటు అనుమతి మంజూరు కాగా, పది రోజుల పాటు యథేచ్ఛగా చెరువుల్లో తవ్వకాలు సాగిస్తున్నారు. పొలాలు మెరక చేసుకునేందుకు ఇచ్చిన అనుమతులను అడ్డుపెట్టుకుని ప్రైవేట్ స్థలాలకు మట్టిని తరలిస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు కనీసంగా రూ.600 వరకు వసూలు చేస్తున్నారు. చెరువుల్లో పూడిక తీత పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వుతూ లోతైన గోతులు పెడుతున్నారు.

పలు చెరువుల్లో తవ్వకాలు..

వేలేరులోని చిన్న మల్లమ్మ కుంట చెరువు, వీరవల్లిలోని పెద్ద చెరువు, కోడూరుపాడులోని రాళ్ల గుంట చెరువులతో పాటు రంగన్నగూడెం, రేమల్లే, మల్లవల్లి గ్రామాల్లోని చెరువుల్లో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వుతున్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ అధికారులు అటు వైపుగా కన్నెత్తి కూడా చూడకపోవటంతో అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఈ వ్యవహారంపై కొందరు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయటంతో పాటుగా సామాజిక మాధ్యమాల్లోనూ పోస్టులు పెట్టడంతో అక్కడక్కడ రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో మట్టి తవ్వకాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నారు.

అనుమతులు లేకుంటే ఉపేక్షించం..

ఇరిగేషన్ శాఖ ద్వారా పలు చెరువుల్లో మట్టి తవ్వకాలకు తాత్కాలిక అనుమతులు మంజూరు చేశారు. ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు సాగిస్తే చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలుచోట్ల చెరువుల్లో మట్టి తవ్వకాలు నిలుపుదల చేశాం. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు సాగిస్తే ఉపేక్షించం.

– బి.మురళీకృష్ణ, బాపులపాడు తహసీల్దార్

యోగాతో ఆరోగ్యకర జీవితం



కానూరులో యోగా చేస్తున్న కమిషనర్ భవానీప్రసాద్ తదితరులు



గన్నవరం విమానాశ్రయంలో..

పెనమలూరు: యోగా చేయటంతో ఆరోగ్యకరమైన జీవితం సాగించవచ్చని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ పి.భవానీప్రసాద్ అన్నారు. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా యోగా కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. యోగా ఉపయోగాలను శిక్షకులు వివరించి, యోగాసనాలు చేయించారు. యోగా వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన యోగా వేడుకల్లో మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్, వైస్ చాన్సలర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది, వాకర్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. కానూరు, పోరంకి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో యోగాసనాలు వేశారు. కానూరు పింగళి వెంకయ్య మున్సిపల్ పార్కులో యోగా గురువు సాంబశివరావు 80 అడుగుల రోడ్డు సంక్షేమ సంఘం సహకారంతో యోగా డే నిర్వహించారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో యోగా గురువు స్వామి అంబర ఆధ్వర్యంలో యోగాసనాలు చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, పాఠశాలల్లో యోగా వేడుకలు నిర్వహించారు.

కంకిపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ వి.భావనారాయణ, ఏఓ బసవయ్య తదితరులు యోగాసనాలు వేశారు. ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో యోగా గురూజీ నేరెళ్ల తులసీకృష్ణ పాల్గొని యోగా ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కంకిపాడు జెడ్పీ పాఠశాలలో హెచ్ఎం డి.ఉమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు లకనం దుర్గాప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులు మత్తి హరిగోపాల్, విద్యాకమిటీ చైర్మన్ అజ్గర్ షరీఫ్ పర్యవేక్షించారు. ఈడుపుగల్లు పంచాయతీ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ పి.ఇందిర, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఈఓ చింతా కిరణ్‌కుమార్, పందిపాటి సుధాకర్, పలువురు వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈడుపుగల్లులోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ నవీన్ పర్యవేక్షణలో జల యోగాసనాలను వేశారు.

గన్నవరం వ్యాప్తంగా యోగా దినోత్సవం

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, జెడ్పీ హైస్కూల్‌లో, కోర్టుల ప్రాంగణం, ప్రథమశ్రేణి గ్రంథాలయం, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో యోగ, ధ్యానం చేశారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి నేతృత్వంలో విమానాశ్రయ అధికారులు, ఎస్పీఎఫ్ భద్రత దళం, ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు, సిబ్బంది యోగాసనాలు వేశారు.

గన్నవరంరూరల్: చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలల్లో ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, డాక్టర్ భీమేశ్వర్, డైరెక్టర్ ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు.

రామవరప్పాడు: రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. అనంతరం రైవస్ కాలువ వంతెన సమీపంలో గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు, విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్, బాపులపాడు మండలంలోని గ్రామాల్లో యోగాసనాలు వేశారు. విజయవాడరోడ్డులో కూటమి నేతల ఆధ్వర్యంలో, వేలేరులోని అమ్మ నిలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ హాజరైయ్యారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యోగాసనాలు చేశారు. ఏలూరురోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల సొసైటీ, నూజివీడు రోడ్డులోని ఆదిత్య బధిరుల విద్యాలయంలో యోగాసనాలు నిర్వహించారు.

నున్న(విజయవాడరూరల్): మండలంలోని అన్ని గ్రామాల్లో యోగా వేడుకలు నిర్వహించారు. ఎంఈవో ఎ.వెంకటరత్నం, గ్రామ పంచాయతీ కార్యదర్శి కోట సురేష్, సచివాలయ సిబ్బంది, వైద్య, ఆరోగ్య సిబ్బంది, వీఆర్వోలు, హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో యోగాసనాలు నిర్వహించారు. అంబాపురం గ్రామంలో ఎంఈవో 2 ఏ.సూరిబాబు పాల్గొని యోగా ప్రయోజనాలను వివరించారు. వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈశా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు, కోయంబత్తూర్‌కు చెందిన ఈశా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో ఎముకల్లో పటుత్వం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఎముకల్లో పటుత్వాన్ని పెంపొందించుకోవచ్చని శ్రీజీవన్ ఆయుర్వేద వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ కేఎస్ఎస్ శివకృష్ణ, డాక్టర్ కె.శ్రీతేజ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ఆధ్వర్యంలో భవానీపురం పాత పోలీస్ స్టేషన్ రోడ్‌లోని ఆయుర్వేద వైద్యశాలలో ఎముకల పటుత్వం, పక్షవాతం, డయాబెటిస్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు, పీడీజీ చైర్మన్ తటవర్తి దుర్గామల్లేశ్వరరావు, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు, క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు పైడిమర్రి వేణుగోపాలరావు, పువ్వాడ లక్ష్మీ శ్రీనివాస్, కోశాధికారి గుర్రం లక్ష్మీనారాయణ, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధర రావు, సభ్యులు పి.హరినాథ్‌ప్రసాద్, ఐవీ అనిల్ కుమార్, వి.రామారావు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు శివకృష్ణ, శ్రీతేజ, క్లబ్ సభ్యులు

దుర్గమ్మ సన్నిధిలో స్వచ్ఛాంధ్ర

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద ఆలయ ఈవో శీనానాయక్ అధికారులు, సిబ్బంది చేత స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆలయ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో శానిటేషన్ సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు ఎస్.రమేష్‌బాబు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



26 నుంచి త్రిశక్తి పీఠంలో వారాహి నవరాత్రులు


కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆషాఢ మాసం పురస్కరించుకుని బస్టాండ్ సమీపంలోని శ్రీకాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో ఈ నెల 26వ తేదీ నుంచి వారాహి నవరాత్రులు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ శనివారం తెలిపారు. 26 నుంచి జూలై 4వ తేదీ వరకు కాళీమాత అమ్మవారు వారాహిదేవిగా దర్శనమిస్తారని తెలిపారు.

యువతకు బ్యాంకింగ్‌పై అవగాహన ఉండాలి



పటమట(విజయవాడతూర్పు): యువత బ్యాంకింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొసిరెడ్డి వీర్రాజు అన్నారు. పటమట బెంజిసర్కిల్ వద్ద ఉన్న కళాశాల ప్రాంగణంలో ఆర్బీఐ, తెనాలికి చెందిన సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ(ఆర్టిడ్స్) ఆధ్వర్యంలో విద్యార్థులకు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవగాహన వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచంలో మోసాల పట్ల అప్రమత్తత అవసరమని తెలిపారు. అలాగే ప్రభుత్వ పథకాలు, ఖాతాల నిర్వహణ, పొదుపు అలవాట్ల గురించి ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్ డాక్టర్ ఎస్.కలహస్తి, బ్యాంక్ మాజీ మేనేజర్ కేసీహెచ్ కోటేశ్వరరావు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్టిడ్స్ ప్రతినిధి బి.భిక్ష మాట్లాడారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా సింధూ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సీనియర్ గాయని సింధూ పర్యవేక్షణలో గాయకులు రాణి, శ్రేయ, సత్య, ఉదయ్‌కాంత్, శివ, సురేష్, నాని, బెనర్జి, వెంకట్, ప్రసాద్‌లు తెలుగు, హిందీ, చిత్ర గీతాలతో పాటు క్లాసికల్స్, సెమీ క్లాసికల్ గీతాలను ఆలపించారు. సీనియర్ గాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గాయనీ గాయకులు సాధన చేయాలన్నారు. గాయని సింధూ మాట్లాడుతూ సింధూ ఈవెంట్స్ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నూతన గాయనీ గాయకులను వేదికకు పరిచయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే భవిత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ వంటి అధునాతన సాంకేతిక అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీసీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ బీవీఎస్ఎస్ఎస్ గోపాల్ అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఇండస్ట్రీ ఇంటరాక్షన్ అండ్ కెరీర్ పాత్ వే గైడెన్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. గోపాల్ మాట్లాడుతూ పరిశ్రమల పనితీరు, ఉద్యోగ అవకాశాలు, మార్కెట్ డిమాండ్స్, భవిష్యత్ కెరీర్ అవకాశాల గురించి విలువైన సూచనలు చేశారు. సాఫ్ట్‌వేర్ రంగం నిత్యం ఆధునికీకరణ చెందుతుందని తెలిపారు. కాలంతో వేగంగా పోటీపడినప్పుడే సరికొత్త నైపుణ్యాలు సాధించగలుగుతామన్నారు. సాఫ్ట్‌వేర్ కెరీర్ ప్రతి క్షణం సవాళ్లతో కూడుకుంటుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ వీటీ రాంపవన్, పీజీ కోర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విమాన గోపురం పనులకు పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలోని వీరాంజనేయ స్వామి వారి ఆలయ విమాన గోపురం పనులకు శనివారం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న వీరాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద పీఠాధిపతి శ్రీదుర్గా ప్రసాద్ స్వామిజీ పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం విమాన గోపురం శిలాస్థాపనకు పూజలు నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, డైరెక్టర్లు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.